క్లుప్తంగా

మంత్రికి కృతజ్ఞతలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మద్దులపల్లి క్రాస్‌రోడ్డు నుంచి కుంట్లం వరకు పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్డు పనులు చేపట్టాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాలు ఇవ్వడంతో రెండు రోజుల కిందట మహదేవపూర్‌కు వచ్చిన సందర్భంలో పీఆర్ ఇంజినీర్లు రూ.12 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయనకు తెలిపారు. శుక్రవారం పలుగులకు రవాణా కష్టాలు తీరుతాయని గ్రామస్తులు మంత్రికి శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ మానెం మహేష్, వడ్లకొండ సమ్మయ్య, ఒద్ది చంద్రయ్య, ఆర్ఎంపీ వైద్యుడు శంకర్, మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, మచ్చ రాజయ్య, కిష్టయ్యలు ఉన్నారు.

గేట్‌వాల్వ్‌లో పడిన గేదె

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పాతబెగుళూర్ గ్రామంలో మిషన్ భగీరథ గేట్‌వాల్వ్‌లో పైకప్పు లేకపోవడంతో శుక్రవారం ప్రమాదవశాత్తు గేదె పడిపోయింది. దీంతో స్థానికులు గమనించి సురక్షితంగా పైకి తీశారు. పైకప్పు తీసి ఉంచడంతోనే ప్రమాదాలు నెలకొంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో చోరీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో చోరీ జరిగింది. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి గర్భగుడిలోకి ప్రవేశించి అమ్మవారి ఆలయంలో శివలింగం (వెండి) బిళ్ల, లక్ష్మీ అమ్మవారి(వెండి)బిళ్లలతో పాటు బీరువా లాకర్ పగులగొట్టి అందులోని రూ.300ల వరకు ఉన్న నగదును దొంగలించినట్లు పూజారి రాజేంద్రప్రసాద్ గౌతమ్ తెలిపారు. ప్రధాన పూజారి లేకపోవడంతో ఇంకా ఏమైన విలువైన ఆభరణాలు చోరీకి గురయ్యాయా తెలియాల్సి ఉంది. చోరీ జరిగిన ఆయలంలో ఎస్సై చక్రపాణి సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులకు కంటిమీద కునుకులేకుండా మారిందని చర్చ జరుగుతుంది.

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్: మండలంలో తాడిచర్ల గ్రామానికి చెందిన నీలం రవళి చర్మ వ్యాధికి సంబంధించిన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. సహాయం కోసం కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1.10 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేశారు. హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎల్‌ఓసీ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



వాజేడు: మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. చీకుపల్లి గ్రామానికి చెందిన గొంది నర్సింహరావు గత సంవత్సరం మృతి చెందారు. ఆయన మృతికి జ్ఞాపకంగా అతని కూతురు విష్ణుప్రియ, మృతుడి తమ్ముడు నారాయణ విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలను అందించారు.

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి



వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం సీఐ బండారి కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిప్పాపురం గ్రామంలో కార్డన్ సర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సీజన్‌లో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున గామస్తులు చేపలను పట్టేందుకు వెళ్లొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి రావు, సిబ్బంది ఉన్నారు.

రిమాండ్‌కు తరలింపు

మహాముత్తారం: మహాముత్తారం మండలంలో పలు కేసుల్లో నిందితులైన మోడమ్ తరుణ్, మోడమ్ శ్రీధర్‌లు అదే గ్రామానికి చెందిన బండి వెంకటేష్ అనే వ్యక్తిని రాడ్‌తో దాడి చేసిన కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు శుక్రవారం తరలించినట్లు ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు. ఇద్దరిని పరకాల సబ్ జైలుకి తరలించినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే వారి పైన చట్టపరంగా తీవ్రమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

బీఆర్ఎస్, బీజేపీ నాయకుల అరెస్ట్



టేకుమట్ల పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు



కాళేశ్వరంలో..

టేకుమట్ల: నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం టీజీపీఎస్సీ ముట్టడిలో భాగంగా బీజేపీ, బీఆర్ఎస్ నాయకులను ఎస్సై గోగికారి ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో మాట్ల వెంకటేష్, బూస నాగరాజు, నూనేటి అరుణ్, నూనేటి సిద్దు, చిలుక మహేందర్, తదితరులు ఉన్నారు.

చిట్యాలలో..

నిరుద్యోగులు సమస్యల పరిష్కారానికి బీజేపీ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ముట్టడి కార్యక్రమానికి చిట్యాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, పీఎస్‌కు తరలించినట్లు ఎస్సై శ్రావణ్ తెలిపారు. అరెస్టు అయిన వారిలో గొర్రె శశికుమార్, మైదం శ్రీకాంత్, శ్రావణ్, కిషోర్, రాజేష్, మణికుమార్, తదితరులు ఉన్నారు.

కాళేశ్వరంలో..

కాళేశ్వరం: నిరుద్యోగులు తలపెట్టిన ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్తున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులను వేర్వేరుగా ముందస్తుగా మహదేవపూర్, కాళేశ్వరం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అక్రమాల అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. అరెస్టైన వారిలో మాజీ డైరెక్టర్ యోగేష్, గ్రామ అధ్యక్షుడు నగునూరి రమేష్, సీనియర్ నాయకులు మేకల సురేష్, మాజీ వార్డు మెంబర్‌లు లేతగారి రవి, కావేరి చంద్రయ్య, నిట్టూరి మహేష్ బీఆర్ఎస్ యువజన నాయకులు రేవెల్లి రాకేష్, బీజేపీ నాయకులు శ్రీకాంత్, కిషన్, దేవయ్యలు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు



ఫాగింగ్ చేస్తున్న జీపీ సిబ్బంది

టేకుమట్ల: వర్షాకాలంలో దోమల నివారణకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం జీపీ సిబ్బంది ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి అడగాని సాంబశివరావు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలతో ప్రజలు విషజ్వరాల బారిన పడే అవకాశం ఉందని, ముందస్తుగా పాగింగ్ చేపించినట్లు తెలిపారు. దోమలు లార్వా దశలనే అంతమొందిస్తే దోమల బెడద నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. అలాగే గ్రామస్తులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాలల్లో వ్యర్థపు నీటి నిల్వలను నివారించి, ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

కొంపెల్లికి కేటీపీపీ స్కూల్ వ్యాన్



స్కూల్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి గ్రామానికి జెన్‌కో ఆధ్వర్యంలో స్కూల్ వ్యాన్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం గ్రామంలో జెన్‌కో అధికారులు, ఉద్యోగులు వ్యానును ప్రారంభించారు. కొంపల్లి గ్రామ ఉద్యోగస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ సహకారంతో కేటీపీపీ సీఈ సిద్దయ్య ఆదేశాల మేరకు స్కూల్ వ్యాన్ వస్తుందని అధికారులు తెలిపారు. కొంపల్లి గ్రామానికి చెందిన పిల్లల తల్లిదండ్రులు, పిల్లలను కేటీపీపీ పాఠశాలలో చేర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయంలో విగ్రహాన్ని తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గీతాబాయి

కాళేశ్వరం: మహదేవపూర్ ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో మాజీ స్పీకర్ శ్రీపాదరావు స్మారక విగ్రహం పెట్టడం విడ్డూరంగా ఉందని, వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ మంథని నియోజకవర్గం మహిళా నాయకురాలు కేదారి గీతాబాయి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మంథనిలో మహనీయుల విగ్రహాలు పెట్టడం జరిగిందన్నారు. ఇప్పుడేమో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ కార్యాలయంలో విగ్రహాలు పెట్టి తమ నేత మెప్పు పొందడానికి ఇక్కడ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. విగ్రహం తొలగించకపోతే పోరాటం చేస్తామన్నారు. ఆమె వెంట మల్హర్ మండలం మహిళా నాయకులు పంతకాని చంద్రకళ ఉన్నారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

కాటారం: మండలకేంద్రానికి చెందిన గంట మహేశ్, మహాముత్తారం మండల కేంద్రానికి మాడెం తరుణ్‌లను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాటారం ఎస్సై అభినవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గంట మహేశ్ మే నెల 9న స్థానిక రాయల్ మండి రెస్టారెంట్‌లో తన స్నేహితులు మాడెం తరుణ్, పెద్దపేట రాజ్‌కుమార్, పంతకాని వినయ్‌లతో కలిసి బిర్యాని తిని డబ్బులు విషయంలో సదరు యజమానిపై దాడి చేయడంతో యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నిందితులు పరారీలో ఉన్నారు. మే 28న మండలంలోని ఆదివారంపేట శివారులో బైక్‌పై వెళ్తున్న మోతె సమ్మయ్యను బైక్‌తో ఢీ కొట్టి, దాడి చేసిన మరో కేసులో మాడెం తరుణ్ నిందితుడిగా ఉన్నాడు. ఈ రెండు కేసుల్లో నిందితులుగా ఉన్న గంట మహేశ్‌ను మండల కేంద్రంలో పట్టుకోగా, మాడెం తరుణ్‌ను మహాముత్తారం పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా ఈ కేసులతో పాటు కొండ రాజబాబు అనే వ్యక్తిని కత్తితో పొడిచి గాయపర్చిన కేసులో పంతకాని వినయ్ అనే యువకుడిని సైతం గత నెల 22న అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. నిందితులను పట్టుకున్న వారిలో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ లక్ష్మిరాజం, శ్రీనివాస్ ఉన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని ధర్నా



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వాజేడు: విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గుడిసె వాసులు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. గుడిసెల ప్రాంతం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చిన వారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. చిమ్మ చీకట్లల్లో మగ్గుతున్నామని, పాములు, తేళ్లు ఏది వచ్చిన తమకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ఎలాంటి ప్రమాదం జరుగక ముందే తమకు విద్యుత్ లైన్ వేసి సరఫరా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈ అర్షద్ అహ్మద్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో దేవయ్య, కృష్ణ బాబు, ముత్తయ్య, సురేష్, సమ్మక్క, యశోద, సోనియా రాణి, సీత తదితరులున్నారు.

సమాన హక్కులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగపేట: నేతకాని కులస్తులకు గిరిజనులతో సమాన హక్కులు కల్పించాలని నేతకాని మహార్ హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మండల కమిటీ అధ్యక్షుడు జాడి సాంబశివరావు ఆధ్వర్యంలో నేతకాని కులస్తుల సమస్యపై పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వీరస్వామికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులతో మమేకమై జీవిస్తున్న నేతకానిలకు గిరిజనులతో పాటు సమాన హక్కులు కల్పించాలని, నేతకాని కులస్తుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. హైదరాబాద్ వేదికగా ప్రత్యేక నేతకాని భవన్ నిర్మించాలని, విద్య, ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండగొర్ల రాంబాబు, నాగేష్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి రెండో విడతలో భాగంగా అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోపా, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్స్‌లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 15 వరకు రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేప్పుడు పదో తరగతి సర్టిఫికెట్‌లో ఉన్నట్లుగా వివరాలు పొందుపర్చాలని, పాస్‌పోర్టు సైజ్ ఫొటో మాత్రమే అప్‌లోడ్ చేయాలని, ఫోన్ నంబర్, మెయిల్ ఐడి, ఆధార్‌కార్డు నంబర్ ఇవ్వాలి ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మొగుళ్లపల్లి: మద్యానికి బానిసై పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని పెద్దకోమటిపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. పెద్దకోమటిపల్లి గ్రామానికి చెందిన వేశాల రాజు (41) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొద్ది కాలంగా మద్యానికి బానిసై తరచూ మద్యం తాగుతూ ఉండేవాడు. కాగా కుటుంబ సభ్యులు మందలించడంతో ప్రవర్తన మార్చుకొని మాములుగా ఉండేవాడు. ఇలా తరచూ జరుగుతూ ఉండేది. ఇటీవల మళ్లీ అదేతంతు పునరావృతం కావడంతో గురువారం ఉదయం భార్య మందలించడంతో వ్యవసాయ బావి దగ్గరికి వెళ్లి పురుగుల మందు సేవించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య వేశాల రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

కాళేశ్వరం: మహాదేవపూర్ మండల కేంద్రానికి చెందిన సుంకరి లక్ష్మీనారాయణ (70) అనే వృద్ధుడు అనారోగ్యం, కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల అనారోగ్యం, కుటుంబ కలహాలతో భార్యతో గొడవ జరిగింది. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. జరిగినవన్ని మనసులో పెట్టుకొని ఆరోగ్యం సహకరించకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి మృతిచెందాడు. అతడి కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు ఎస్సై పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేసీబీ డ్రైవర్..

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని కర్కపల్లి గ్రామంలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలం రావులపల్లి గ్రామానికి చెందిన మల్లెబోయిన శ్రీధర్ (26).. ముత్తారం మండలం నిమ్మగూడేనికి చెందిన కల్యాణి రెండు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకుని, కర్కపల్లిలో నివసిస్తున్నారు. శ్రీధర్ జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి పాప హయతి ఉంది. ఈ క్ర మంలో ఈ నెల 4న గురువారం రాత్రి ఇద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీధర్ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీధర్ తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సూరారంలో గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం సూరారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ఏ ప్రసాద్ అధ్యక్షతన గ్రామసభ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్షాకాలం సీజన్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య నిర్వహణ ప్రతిరోజు చేపట్టాలని గ్రామపంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ కార్యదర్శి బండం అంజలి, గ్రామపంచాయతీ కారోబార్ వంగల రాజమౌళి, ప్రజలు పాల్గొన్నారు

పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలి



ప్రత్యేక అధికారిని సన్మానిస్తున్న కార్యదర్శులు

కాటారం: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని మండల పరిషత్ ప్రత్యేక అధికారి సంజీవరావు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మురుగు నీటి కాల్వలు శుభ్రపర్చడంతో పాటు కాలనీల్లో పిచ్చి మొక్కల తొలగింపు, క్లోరినేషన్ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన సంజీవరావును పంచాయతీ కార్యదర్శులు శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో ఎంపీఓ ఉపేంద్రయ్య, సీనియర్ అసిస్టెంట్ విద్యానాథ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాసేవకే అంకితమవుతాం..



జ్ఞాపికను అందజేస్తున్న గ్రామస్తులు

చిట్యాల: పదవులు ఉన్నా.. లేకున్న ప్రజల మధ్య ఉంటూ ప్రజా సేవకే అంకితమవుతామని టేకుమట్ల తాజా మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి, గిద్దెముత్తారం మాజీ ఎంపీటీసీ పప్పుల విజయలక్ష్మీ-సంజీవ్‌లు అన్నారు. శుక్రవారం గిద్దెముత్తారం గ్రామంలో మాజీ జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు గ్రామస్తులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో ప్రజల మధ్యలో ఉండి అనేక సమస్యలను పరిష్కారించి ప్రజలకు అందుబాటులో ఉన్నామన్నారు. మాకు పదవులు ఉన్న లేకున్న ప్రజల మధ్యలో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పోలవేన పోశాలు, పులి సునీత అంజిరెడ్డి, గ్రామస్తులు అవుల ఐలయ్య, మహేష్, సిద్దు, సంపత్, నర్సింగం, చేరాలు, ప్రభాకర్, సంతోష్, తిరుపతి, పంచాయతీ కార్యదర్శి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

'బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు'



మద్యం తాగుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

టేకుమట్ల: ప్రధాన రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. శుక్రవారం వెలిశాల-గర్మిళ్ళపల్లి ప్రధాన రోడ్డు వెంట బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వెలిశాల గ్రామానికి చెందిన ఐలయ్య, సారంగం, కుమార్‌లపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంతో వాహనదారులకు, పాదాచారులకు ఇబ్బంది కలుగుతుందని, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ మల్లన్న, టీఎస్ఎస్పీ కానిస్టేబుల్‌లు ఉన్నారు.

బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న చంద్రబోస్

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామంలో నిర్మించిన అస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో చిట్యాల హైస్కూల్ విద్యార్థులు తన ప్రతిభను కనబరిచినందుకు గాను సినీ గేయ రచయిత, అస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కొడెపాక రఘుపతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజమౌళి, నీలిమారెడ్డి, సరళదేవి, సదయ్య, , రామనారాయణ, ఉస్మానలి, సుజాత, విజయలక్ష్మీ, కల్పన, గడ్డం శంకర్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సాంబమూర్తి, బుజ్జమ్మ, భాస్కర్ విద్యార్థులు సమీరా, హాసిని, హర్ష తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల రక్షణ కవచం 'పెసా'

- సమ్మక్క-సారలమ్మ జిల్లా పేరు మార్పుపై ఏకగ్రీవ తీర్మానం
- హేమాచల క్షేత్రం చైర్మన్, డైరెక్టర్లను ఆదివాసీలకు కేటాయించాలి
- ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ ప్రభాకర్

మంగపేట: ఏజెన్సీ ప్రాంతాలకు పెసా చట్టం గిరిజనులకు రక్షణ కవచం లాంటిదని ఏటూరు నాగారం ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ అన్నారు. మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజన అవాస ప్రాంతమైన మామిడిగూడెంలో పెసా గ్రామసభ శుక్రవారం జరిగింది. కుల ఆచార సాంప్రదాయ పెద్దలు జజ్జరి ఎల్లయ్య, పెద్ది సతీష్, డ్వాక్రా మహిళా కార్యదర్శి కుంజ నిర్మల, పెసా అధ్యక్ష కార్యదర్శులు కల్తి ఆనందరావు, యాలం రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రభాకర్ హాజరై మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలోని భూమిపై పూర్తి హక్కులు గిరిజనులకే ఉంటాయన్నారు. గిరిజనేతరులు భూక్రయ విక్రయాలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ప్రతి అభివృద్ధి పనులను ట్రైబల్ వీడీసీల ద్వారానే పనులు కొనసాగిస్తూ పెసా నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం పలు అంశాలపై పెసా నిబంధనల ప్రకారంగా చేతులు ఎత్తి ఏకగ్రీవ తీర్మాణం చేశారు. ములుగును సమ్మక్క-సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలని, మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్, డైరెక్టర్లను ఆదివాసీలతోనే భర్తీ చేయాలని తీర్మాణించారు. అనాదిగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, రెవెన్యూ భూములకు పట్టాలు ఇవ్వాలని, గుంబా, బెల్టు షాపులను పూర్తిగా నియంత్రించాలని తీర్మాణం చేశారు. కమలాపురంలో బిల్ట్ ఫ్యాక్టరీ స్థానంలో నూతనంగా నిర్మించే కార్మాగారంలో ఉద్యోగాల్లో స్థానిక ఆదివాసీలతో భర్తీ చేయాలని మరో 25 అంశాలపై గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై టీవీఆర్ సూరి, పంచాయతీ కార్యదర్శి మోడెం రాజేష్, హేమాచల క్షేత్రం జూనియర్ అసిస్టెంట్ సీతారాములు, పెసా మొబిలైజర్ తాటి విజయ్‌బాబు, ఎఫ్‌బీఓ విజయరావు, ట్రాన్స్‌కో అధికారి రవి, ఐకేపీ సీసీ జనార్దన్, హెచ్ఎం వెంకన్న, గిరిజన సంఘాల నాయకులు నల్లెబోయిన లక్ష్మణ్‌రావు, మారబోయిన గోవర్ధన్, యాలం కాంతారావు, కోరె నర్సింహులు 250 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.